సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 13 । జనవరి । 2024



ఘనంగా కూడారై ఉత్సవం

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. IIలో



16న బౌద్ధ మేళా

అనకాపల్లి: శంకరం బొజ్జన్నకొండ వద్ద ఈనెల 16న బౌద్ధ మేళాకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. IIలో

ఘనంగా దీపాలంకరణ



విశాఖలోని కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం సహస్రదీపాలంకరణను వేడుకగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

డిప్యూటీ సీఎంను కలిసిన భాగ్యలక్ష్మి దంపతులు



డిప్యూటీ సీఎం రాజన్నదొరకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను సాలూరులోని ఆయన స్వగృహంలో పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ సమన్వయకర్త కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు దంపతులు శుక్రవారం కలిశారు. వారికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అరకు పార్లమెంట్ పరిధిలోని అంశాలపై సమీక్షించినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్,ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని ఐదుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను శుక్రవారం ఐటీడీఏ ప్రాంగాణంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ పంపిణీ చేసారు.దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ వీటిని మంజూరు చేసింది.అలాగే ఒకరికి వినికిడి పరికరాలను కలెక్టర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్వో వీవీ రమణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ రామారావు (చిత్రంలో నిందితుడు)

వీఆర్‌పురం: భార్యపై అనుమానంతో ఆమె గొంతు కోసి హతమార్చిన భర్తను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎటపాక సీఐ డి.రామారావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వీరపాపనకుంట గ్రామానికి చెందిన సోయం చిరంజీవి, ఈనెల 5వ తేదీన ఇంట్లో నిద్రిస్తున్న సోయం రాధ (35)ను అనుమానంతో కత్తితో దాడి చేసి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పోలీసులు నాలుగు బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టినట్టు సీఐ తెలిపారు. ఎట్టకేలకు అతనిని, హత్య చేసేందుకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నామని ఆయన వెల్లడించారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటేష్, సిబ్బందిని ఆయన అభినందించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

- చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



రికార్డులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: ఎంతో నమ్మకంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించి ఓపీ, ఇన్‌పేషంట్ విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలను రోగుల నుంచి తెలుసుకున్నారు. ఎక్స్‌రే ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం రక్తపరీక్ష కేంద్రం, ఫార్మసీ, గర్భిణులు, చిన్నపిల్లల వార్డులను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. మారుమూల గ్రామాల నుంచి వచ్చే రోగులకు అవసరమైన వైద్యాన్ని సకాలంలో అందించాలని పీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుజాత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, వైద్యులు పాల్గొన్నారు.

బండారు బెండు వంచారు

- జనసేన పొత్తుతో పెందుర్తి టికెట్ కట్
- మాడుగులకు వెళ్లాలంటూ అధినేత ఆదేశం
- పెందుర్తి కావాలంటూ బండారు పట్టు
- కష్టమేనంటున్న సొంత పార్టీ నేతలు
- రోజాపై వ్యాఖ్యల తర్వాత మరింతగా దిగజారిన పరిస్థితి
- బండారు రాజకీయ చాప్టర్ క్లోజ్ అంటున్న సన్నిహితులు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

సీటు కోసం నోటికి పని చెప్పి... వయస్సును కూడా మరచిన బండారు బెండు వంచింది సొంత పార్టీ. రానున్న ఎన్నికల్లో పెందుర్తి నుంచి టికెట్ లేదంటూ ఆ పార్టీ అధినేత బండారుకు తేల్చి చెప్పినట్టు సమాచారం. జనసేనతో పొత్తు నేపథ్యంలో ఈ సీటును ఆ పార్టీకి కేటాయించనున్నట్టు పార్టీ పెద్దలు స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ఒకవేళ ఎన్నికల రాజకీయంలో ఉండాలంటే మాడుగుల నియోజకవర్గం నుంచి అదృష్టాన్ని పరీక్షించుకోవాలని తేల్చిచెప్పినట్టు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, మాడుగుల నుంచి బరిలోకి దిగేందుకు బండారు ససేమిరా అంటున్నారు. పెందుర్తి టికెట్ కావాలంటూ అధిష్టానం వద్ద మార్కులు కొట్టేసేందుకు వయస్సును కూడా మరచి మంత్రి రోజాపై అవాకులు చెవాకులు పేలారు. అయినప్పటికీ బండారుకు గ్రీన్‌సిగ్నల్ లభించలేదు. పైగా ఆయన వ్యాఖ్యలతో మరింతగా పరిస్థితి దిగజారిపోయిందంటూ సొంత పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటే ఇక బండారు సత్యనారాయణమూర్తి రాజకీయ చాప్టర్ ముగిసిన అధ్యాయమేనని ఆయన వర్గీయులే వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తంగా సీటు కోసం నోటికి పనిచెప్పి ఉన్న కొద్దిపాటి గౌరవాన్ని దిగజార్చుకున్నా ఫలితం లేకపోవడంతో తన సన్నిహితుల వద్ద పార్టీ అధినాయకత్వంపై మండిపడుతున్నట్టు తెలుస్తోంది. మంత్రి రోజాపై వ్యాఖ్యల తర్వాత బండారు రాజకీయ గ్రాఫ్ మరింత వేగంగా దిగజారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పెందుర్తి సీటుపై జనసేన కన్ను

గతంలో ప్రజారాజ్యం పార్టీ తరఫున పెందుర్తి నియోజకవర్గం నుంచి గెలవడంతో ఈ సీటు కోసం జనసేన పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఈ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానంటూ పంచకర్ల రమేష్‌బాబు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. అధికారికంగా పార్టీ ప్రకటించనప్పటికీ ఈ సీటు తనదేనని ఆయన చెప్పుకుంటున్నారు. అయితే, సీటు జనసేనకు కేటాయించినా తెలుగుదేశం పార్టీ వర్గాలు సహకరించేది కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికీ సీట్ల వ్యవహారం కొలిక్కిరాకపోవడంతో తెలుగుదేశం-జనసేన కలిసి జెండాలు పట్టుకుని రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. ఇక్కడ మాత్రం ఎక్కడా కలిసి కార్యక్రమాలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. ఒకవేళ అధికారికంగా బండారుకు ఝలక్ ఇస్తే.. జనసేన అభ్యర్థికి సహకరించడం కష్టమేనని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే ఇరు పార్టీల పొత్తుకు ఇక్కడి నుంచే బీటలు పడటం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

వాస్తవానికి గతంలో పెందుర్తి నియోజకవర్గం నుంచి గెలిచి మంత్రిగా కూడా బండారు పనిచేశారు. గత ఎన్నికల్లో యువకుడైన అదీప్‌రాజ్ చేతిలో మట్టికరిచారు. అప్పటి నుంచి ఎలాగోలా వార్తల్లో ఉండేలా బండారు నోటికి పనిచెబుతూ వస్తున్నారు. ప్రభుత్వంపై ఏదో ఒక ఆరోపణ చేస్తూ వార్తల్లో నిలిచే విధంగా చూసుకున్నారు. అయితే, ప్రజల్లో మద్దతు కోల్పోవడంతో ఆయనకు సీటు ఇచ్చినా గెలిచే అవకాశం లేదని తెలుగుదేశం పార్టీ భావిస్తోంది. అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గంలో చేసినా ఆరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి. ఆయన కుమారుడు వ్యవహరించిన తీరు ప్రజల్లో వ్యతిరేకతను మరింతగా పెంచింది. ఆయన అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టలేదు. కేవలం భూకబ్జాలకే పరిమితమయ్యారన్న విమర్శలు వినిపించాయి. ఈ నేపథ్యంలోనే పెందుర్తి నియోజకవర్గాన్ని తమకు కేటాయించాలంటూ జనసేన పార్టీ పట్టుబట్టింది. అయితే, పెందుర్తి నుంచి టికెట్ ఇవ్వకపోతే తన సత్తా చూపిస్తానంటూ బండారు సన్నిహితుల వద్ద తేల్చిచెబుతున్నట్టు తెలుస్తోంది. వయసైపోయిన నేపథ్యంలో తనకు రాజకీయ భవిష్యత్ లేకుండా పోతుండటం.. ఇప్పటికీ వారసత్వంగా కొడుకును పరిచయం చేయకపోవడం బండారును చాలా బాధ పెడుతున్నట్టు తెలుస్తోంది.

అరకు ఎంఈవో-1 సరెండర్

- కలెక్టర్ ఆదేశాలు జారీ

సాక్షి,పాడేరు: అరకులోయ ఎంఈవో-1 గా పనిచేస్తున్న వి.త్రినాథరావును ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో ఈ చర్యలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

పీవీటీజీలకు ఉచిత విద్యుత్ సదుపాయం



మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ ఏఈఈ వనుము ప్రభాకరరావు

చింతపల్లి రూరల్: చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పీవీటీజీ కుటుంబాలకు పూర్తి స్థాయిలో ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈపీడీసీఎల్ ఏఈఈ వనుము ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్ వద్ద విలేకరులతో మాట్లాడారు. పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా గిరిజన గ్రామాల్లో సర్వే చేసి పీవీటీజీ కుటుంబాల వివరాలను సేకరించినట్టు చెప్పారు. మండలంలో 1517 కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం లేనట్టుగా గుర్తించామని చెప్పారు. గూడెంకొత్తవీధి మండలంలో సర్వే జరుగుతుందని చెప్పారు. పీవీటీజీలకు ఉచితంగా విద్యుత్ వినియోగించుకోవచ్చని ఈపీడీసీఎల్‌కు ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

పాడేరు సంతలో సంక్రాంతి సందడి

- భారీగా తరలివచ్చిన గిరిజనులు
- పండగ సామగ్రి కొనుగోలు



పండగ సంత జనంతో రద్దీగా పాడేరు మెయిన్‌రోడ్డు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరులో శుక్రవారం జరిగిన సంక్రాంతి పండగ వారపుసంతకు గిరిజనులు పోటెత్తారు. వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చి విక్రయించారు. వచ్చిన ఆదాయంతో సంక్రాంతి పండగకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు. రాజ్‌మా, కాఫీ గింజలు, పసుపు, పిప్పలమోడి తదితర వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు భారీగా జరిగాయి. హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, చింతపల్లి మండలాలకు చెందిన పలు గ్రామాల గిరిజనులు సంతకు రావడంతో కిక్కిరిసింది. రోడ్డు పక్కన, మెయిన్‌రోడ్డు, పాత బస్టాండ్, సినిమాహాల్ సెంటర్‌లోని వస్త్ర దుకాణాలు రద్దీగా కనిపించాయి. దుస్తులను భారీగా కొనుగోలు చేశారు. పాత బస్టాండ్, మెయిన్‌రోడ్డు, సంత ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బందోబస్తు నిర్వహించి క్రమబద్ధీకరించారు.

100 మెట్రిక్ టన్నుల మిరియాలు కొనుగోలు లక్ష్యం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- కిలో రూ.500కు విక్రయించాలని రైతులకు విజ్ఞప్తి

సాక్షి,పాడేరు: పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలోని మాక్స్ సొసైటీ ద్వారా గిరి రైతుల నుంచి 100 మెట్రిక్ టన్నుల మిరియాలు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మిరియాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నందున గిరిజన రైతులు కిలో రూ.500 ధరకు విక్రయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పాడేరు ఐటీడీఏ ఆధీనంలోని మాక్స్ సంస్థ ద్వారా కిలో రూ.500కు తక్కువ కాకుండా మిరియాలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. మిరియాలను కొనుగోలు చేసి వారం రోజుల్లోగా ఆయా రైతులు బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తామన్నారు.గతేడాది కూడా కిలో రూ.500తో మిరియాలను గిరిజన రైతులు అమ్ముకుని మంచి లాభాలు పొందారని పేర్కొన్నారు. కిలోకు రూ.500 చెల్లించే వ్యాపారులకు మాత్రమే గిరి రైతులు విక్రయించాలని ఆయన సూచించారు.

ఈనెల 15న పీఎం జన్‌మన్ ప్రారంభం

ప్రధానమంత్రి నరేంద్రమోది ఈనెల 15వతేదీన అరకులోయలో పీఎం జన్‌మన్ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. అరకులోయ మండలం కొత్తబల్లుగుడలో ఈ కార్యక్రమం ఏర్పాటుచేసినట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పీవీటీజీ గిరిజనులను అభివృద్ధి చేసే లక్ష్యంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా పీఎం జన్‌మన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రధానమంత్రి పీవీటీజీ లబ్దిదారులతో వర్చువల్ విధానంలో మాట్లాడే అవకాశం ఉందన్నారు.

17,18 తేదీల్లో సామాజిక సమత సంకల్పం

ఈనెల 19వతేదీన విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని గ్రామ సచివాలయాల్లోను సామాజిక సమత సంకల్పం కార్యక్రమాన్ని ఈనెల 17,18 తేదీల్లో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 18న అన్ని సచివాలయాల్లో డాక్టర్ అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించాలని సూచించారు. ఆదే రోజు జిల్లా కేంద్రం పాడేరులోని అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసిన అనంతరం అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులతో ఐటీడీఏ వరకు సామాజిక సమత సంకల్ప ర్యాలీని నిర్వహిస్తామన్నారు. కలెక్టరేట్ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత చింతూరు డీఎఫ్ఏ జట్టు

- విజేతలకు బహుమతి ప్రదానం
- పోలీసుశాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు: ఏఎస్పీ రాహుల్‌మీనా



హోరాహోరీగా తలపడుతున్న చింతూరు, డోర్నకల్ జట్లు



ఫుట్‌బాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏఎస్పీ రాహుల్‌మీనా

చింతూరు: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చింతూరులో నిర్వహించిన అంతరాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో శుక్రవారం జరిగిన ఫైనల్‌లో చింతూరు డీఎఫ్ఏ (డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ అసోసియేషన్)జట్టు విజేతగా నిలిచింది. రెండ్రోజుల పాటు నిర్వహించిన ఈ టోర్నమెంటులో ఆంధ్రా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాకు చెందిన ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. ఆంధ్రాకు చెందిన చింతూరు, తెలంగాణకు చెందిన డోర్నకల్ జట్లు ఫైనల్‌కు చేరాయి. శుక్రవారం జరిగిన ఫైనల్ పోరులో నిర్ణీత సమయానికి ఇరుజట్లు చెరో గోల్ చేయడంతో పెనాల్టీ షూటౌట్ నిర్వహించారు. ఇరు జట్లకు చెరో ఐదు గోల్స్‌కు అవకాశమివ్వగా చింతూరు ఐదు గోల్స్ సాధించగా డోర్నకల్ నాలుగు గోల్స్ మాత్రమే చేయగలిగింది. చింతూరు డీఎఫ్ఏ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఏఎస్పీ రాహుల్‌మీనా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఆయనతోపాటు ఎస్టీ కమీషన్ సభ్యుడు చిచ్చడి మురళి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గాంధీబాబు ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ట్రెజరర్ యడమ అర్జున్, జిల్లా కార్యదర్శి పూనెం కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి స్మగ్లర్ల అరెస్టు

- ఐదు కిలోల స్వాధీనం
- నిందితులను రిమాండ్‌కు తరలింపు



పట్టుకున్న గంజాయి, నిందితులతో ఎస్ఐ రవీంద్ర, పోలీసులు

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన శుక్రవారం వెల్లడించారు. గంజాయి తరలిస్తున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు పోలీసులు అప్రమత్తమయ్యాయి. కిలగాడ మూడు రోడ్ల జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా బూసిపుట్టునుంచి వస్తున్న బైక్‌ను నిలిపి తనిఖీ చేస్తుండగా అదే వాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులు పరారయ్యేందుకు ప్రయత్నించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న బ్యాగ్‌లోని ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. నిందితులిద్దరిని రిమాండ్‌కు తరలించామని వారి వద్ద నుంచి వాహనం, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేశామని చెప్పారు. నిందితులు ఒడిశాలోని కలహండి జిల్లా చోరియాఘర్ బ్లాక్ బండిబాసుల్ గ్రామానికి చెందిన బబ్లూ మెహర్, మంచంగిపట్టు మండలం బూసిపుట్టు పంచాయతీ సుల్తాన్‌పుట్టు గ్రామానికి చెందిన కిలో సన్యాసిరావుగా గుర్తించామని ఎస్ఐ తెలిపారు. తనిఖీల్లో ఏఎస్ఐ లక్ష్మయ్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలి



బహుమతులు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

రంపచోడవరం: సంక్రాంతి పండగను ఉత్సాహంగా జరుపుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్‌కుమార్ కోరారు. స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలన్నారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి సంకురు హేమరత్నమణి, పి.మాధురి, రెండో బహుమతి కె. సునీత, మూడో బహుమతి నిహారిక అందజేశారు. వెలుగు ఆధ్వర్యంలో వెదురుతో తయారు చేసిన వస్తువులతో ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ హెడ్ సూర్య, రంపచోడవరం బ్రాంచ్ మేనేజర్ తీగల మురళీమోహన్, టీపీవో రాంబాబు, హౌసింగ్ ఈఈ రామచంద్రమూర్తి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దట్టంగా పొగమంచు



పాడేరు పాత బస్టాండ్‌లో కురుస్తున్న మంచు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా పొగమంచుతో పాటు చలిగాలులు విజృంభిస్తున్నాయి.అర్ధరాత్రి నుంచి పొగమంచు దట్టంగా కురుస్తోంది. పాడేరు, అరకులోయ, చింతపల్లి ప్రాంతాల్లో ఉదయం 9గంటల వరకు పొగమంచు దట్టంగా కురిసింది. సూర్యోదయం ఆలస్యమైంది. పాడేరు పాతబస్టాండ్‌లోని వారపుసంత మంచు ముసుగులోనే జరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 12.8 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 13, అరకులోయలో 14.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు శుక్రవారం నమోదయ్యాయి. సాయంత్రం నుంచి చలిగాలులు అధికమయ్యాయి.

పిల్లి గెడ్డ వంతెనకు మోక్షం

- రూ.3.27 కోట్లతో నిర్మాణం
- చురుగ్గా పనులు
- గుంటవాడ జలాశయానికి నీటి సరఫరాలో కీలకం
- రాష్ట్ర ప్రభుత్వం కృషితో నిధులు మంజూరు చేసిన కేంద్రం
- పరిసర గ్రామాల ప్రజల్లో ఆనందం



శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి (ఫైల్)



శరవేగంగా జరుగుతున్న పిల్లి గెడ్డ బ్రిడ్జి పనులు

సీలేరు: ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల్లో రవాణా సౌకర్యం మెరుగుపడుతోంది. రహదారులు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.కోట్లలో ప్రభుత్వాలు నిధులు వెచ్చిస్తున్నాయి. ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో సీలేరు ప్రాంతం కీలకం కావడంతో అభివృద్ధిపై ప్రత్యేకదృష్టి సారించాయి. దీనిలో భాగంగా పిల్లి గెడ్డపై శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జిని రూ..3.27 కోట్లతో పునర్నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వీటితో 50.660 మీటర్ల పొడవునా 9.5 మీటర్ల ఎత్తులో బ్రిడ్జి (డబుల్‌లైన్) నిర్మాణం జరుగుతోంది.

ఎంతో కీలకం

పిల్లిగెడ్డపై బ్రిడ్జి ఎంతో కీలకం. సరిహద్దు ప్రాంతాల నుంచి వస్తున్న వర్షం నీరు ఈ బ్రిడ్జి దిగువ నుంచి ఏపీ జెన్‌కోకు చెందిన సీలేరులోని గుంటవాడ జలాశయంలో చేరుతుంది. ఈ బ్రిడ్జి నిర్మించి సుమారు 70 సంవత్సరాలు కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీనిని పునర్నిర్మించాలని ఈ ప్రాంతీయులు కొంతకాలంగా అధికారులను కోరుతున్నారు. ఈ నేపథ్యంలో బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనల మేరకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

రాష్ట్ర ప్రభుత్వానిదే ఘనత



బ్రిడ్జి నిర్మించాలని గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు ప్రతిపాదనలు పంపించాం. అయినా పట్టించుకోలేదు. బ్రిడ్జి ప్రాధాన్యతను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గుర్తించింది. నిధులు మంజూరుకు కృషి చేసింది. ఒడిశా సరిహద్దు నుంచి ఐస్ గెడ్డ వరకు రహదారిని నిర్మించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుంది.

– గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్, కాట్రగెడ్డ

నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం



ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో పిల్లి గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి మంజూరైన నిధులతో పనులు చేపట్టాం. ప్రస్తుతం చురుగ్గా జరుగుతున్నాయి. నిర్మాణ పనుల్లో పూర్తిస్థాయిలో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఎప్పటికప్పుడు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ వేగవంతం చేస్తున్నాం.

– ఐ.కల్యాణ్ కుమార్, డీఈ, పంచాయతీరాజ్, సీలేరు

ప్రతి రోజూ పండగే..

తెలుగు వారికి సంక్రాంతి పండగ ఎంత ప్రత్యేకమో.. ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రామ తీర్థాలు అంతే విశిష్టమైనవి. భోగి రోజున ప్రారంభమైన తొలి తీర్థం నుంచి ఒకటే సందడి... ఏ ఊరెళ్లినా వినోద, సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలమే.. ఎటు చూసినా జనసందోహమే.. ప్రతి ఇంటా బంధువులు, అల్లుళ్లు, కోడళ్లతో ఒకటే హడావుడి.. ఇలా మూడు మాసాలపాటు విందు వినోదాలు, అతిథి మర్యాదలతో బిజీబిజీగా పల్లెలు కనిపించనున్నాయి.

- సంక్రాంతి తీర్థాలకు ముస్తాబవుతున్న గ్రామాలు
- గ్రామీణులకు ఆటవిడుపుగా తీర్థాలు..
- రేపటి నుంచి గ్రామీణ జిల్లాలో ప్రారంభం
- నేటికీ చెక్కు చెరగని తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు


స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం


రంగుల రాట్నాలు


బెలూన్ల అమ్మకాలు

చోడవరం: ఏడాదంతా ఎండనకా వాననక కాయకష్టం చేసి అలసిపోయే పల్లె ప్రజలకు సంక్రాంతి పండగతో ఆరంభమయ్యే తీర్థాలు ఎంతో ఆటవిడుపును కలిగిస్తాయి. పట్టణ ప్రాంతాల్లో వారికి పార్కులు, బీచ్‌లు, ఇతర వినోద విహార ప్రాంతాలు అందుబాటులో ఉంటాయి. పల్లెల్లో ఇటువంటివేవీ ఉండవు. ఈ నేపథ్యంలో ఏడాదికొకసారి వచ్చే సంక్రాంతి తీర్థాలంటే గ్రామీణ ప్రజలకు ఎంతో ఇష్టం. చిన్నాపెద్దా అందరికీ ఈ తీర్థాలు మహానందాన్ని కలిగిస్తాయి. తమతమ గ్రామాల్లో జరిగే తీర్థాలకే కాకుండా సమీప గ్రామాల్లో నిర్వహించే వాటికి కాలినడకన సైతం వెళ్లి మరీ చూసి సంబరపడతారు. తీర్థాలంటే గ్రామాల్లో ఒక రకమైన బంధువుల మధ్య ప్రేమానుబంధాలు కలిపే పండగలని చెప్పవచ్చు.

భోగి రోజున చోడవరం విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద మొదటి తీర్థం...

ఏటా భోగి పండగ నుంచి గ్రామాల్లో తీర్థాలు ప్రారంభమవుతాయి. ఆదిదేవుడైన చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరుడి ఆలయం వద్ద జరిగే తీర్థం నుంచే జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ప్రారంభమవుతాయి. కాణిపాకం వినాయకుని తర్వాత అంతటి సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరుడి ఆలయం వద్ద భోగి రోజైన ఆదివారం మొదట తీర్థం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. 40 రోజులకు పైబడి రోజుకు రెండు, మూడు గ్రామాల్లో అన్ని చోట్ల తీర్థాలు నిర్వహిస్తారు. చిన్నచిన్న గ్రామాల్లోనైతే ఒక తీర్థమే నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లాలో ఆలయాలు, గ్రామదేవతల గుడిల వద్ద, ప్రముఖుల సంస్మరణార్థం, జాతీయ నాయకులు, అభిమాన నేతల విగ్రహాల వద్ద ఈ తీర్థాలు నిర్వహిస్తుంటారు.

తీర్థమంటే వినోదమే..

గ్రామీణ తీర్థమంటే ప్రతి ఒక్కరికీ వినోదం కలిగిస్తోంది. గిర్రున తిప్పే రంగుల రాట్నాలు, జెయింట్ వీల్స్, పట్టాలపై పరుగులు తీసే రైళ్లు, నోరూరించే పంచదార చిలుకలు, గ్రామీణులకే అందుబాటులో ఉండే నెయ్యిచెక్కీలు, ఖర్జూరం దుకాణాలతోపాటు పండగ వాతావరణాన్ని తీసుకువచ్చే రంగురంగుల బెలూన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఆయా గ్రామాల్లో నిర్వహించే ఎడ్ల బళ్లు, గుర్రం పందేల పోటీలు చిన్నాపెద్దా అందరికీ హుషారు కలిగిస్తాయి. ఈ తీర్థాలకు పిల్లలను తీసుకెళ్లి వారికి బెలూన్లు, రకరకాల బొమ్మలు, తినుబండారాలను కొనిచ్చే మధురానుభూతి ప్రతి ఒక్కరిలో తమ బాల్యాన్ని గుర్తుకు తెస్తోంది. బంధుమిత్రులను ఆహ్వానించి విందు వినోదాలతో అతిథి మర్యాదలు చేయడంతో గ్రామమంతా సందడి నెలకొంటోంది. మందుబాబుల విందులు తోడవ్వడంతో వారి హడావిడి అంతా ఇంతా కాదు. బతుకుదెరువు కోసం, ఉద్యోగాల కోసం పట్టణాలకు వెళ్లిన వారు కూడా తమతమ గ్రామాల్లో జరిగే తీర్థాలకు విధిగా హాజరై ఎంతో ఆనందంతో గడుపుతారు. ఈ తీర్థాల జోరు గ్రామీణుల్లో ఎంతో హుషారును నింపి కొత్త ఉత్సాహంతో తిరిగి పనీపాటల్లో పాల్గొనేలా చేస్తాయి. సాంకేతిక యుగంలో పరుగులు తీస్తున్న మనం నేటికీ గ్రామీణ సంస్కృతిని కాపాడుకుంటూ.. బంధు, బంధుత్వాలను మరింత దగ్గర చేర్చడానికి ఈ తీర్థాలు దోహదం చేస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు.

సమయపాలన పాటించని అధికారులపై చర్యలు

- కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరిక


స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ కార్తీక్, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి హాజరుకానివారితోపాటు సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం పాడేరు ఐటీడీఏలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ కార్తీక్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్వో వీవీ రమణ ప్రజల నుంచి 87 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనకు వచ్చిన వినతులకు ప్రత్యేకాధికారులను నియమించి, ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కార వివరాలను సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలని సూచించారు. జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో అందిన ఫిర్యాదులు, అర్జీలపైన అధికారులు సకాలంలో స్పందించాలని కోరారు. కొంత మంది లాగిన్ అవ్వకపోవడంతో పాటు సమస్య పరిష్కారం కాకుండానే అయినట్లు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడాన్ని గుర్తించామన్నారు. అటువంటి అధికారులను ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు.

అర్జీల్లో కొన్ని..

- జి.మాడుగుల మండలం కోరాపల్లి పంచాయతీ పాలకొండకు చెందిన పీవీటీజీ గిరిజనులు చిరంజీవి ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు
- జి.మాడుగుల మండలంలోని పాలమామడి పంచాయతీ కొంతులం గ్రామానికి చెందిన పాలికి రాట్నాలమ్మ రైతు భరోసా అమలుజేయాలని అర్జీ అందజేసింది.
- పాడేరు మండలం కాడెలి పంచాయతీ గురుపల్లి గ్రామానికి చెందిన పద్మకుమారి,విమల సీసీ రోడ్లు నిర్మించాలని దరఖాస్తు చేశారు
- చింతపల్లి మండలం బలపం పంచాయతీ గుంజివీధిలో సీసీరోడ్లుతో పాటు పాఠశాల,అంగన్‌వాడీ భవనాలను నిర్మించాలని గ్రామస్తులు శాంతి,ఆదినారాయణరావు వినతి పత్రం అందజేశారు.
- హుకుంపేట మండలం అడ్డుమండ సమీపంలోని దిగుమోదాపుట్టు రోడ్డులో కొట్టుకుపోయిన పైప్ కల్వర్టుకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టాలని సర్పంచ్ గుమ్మా శ్యామ్ కోరారు.
- ముంచంగిపుట్టు మండలంలోని పనసపుట్టు. బోడిపుట్టు,ముఖీపుట్టు,బొడ్డాపుట్టు గ్రామాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి,విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని జనం తిరుపతిరావు కోరారు.అలాగే మాలగుమ్మి నుంచి బూసిపుట్టు వరకు తారురోడ్డు నిర్మించాలని సర్పంచ్‌తో పాటు గిరిజనులు కోరారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధిపై దృష్టి

- ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ రామ్మోహన్‌రావు


ప్రభుత్వం పథకాల వివరిస్తున్న ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ రామ్మోహన్‌రావు

నాతవరం: పాడి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టరు రామ్మోహన్‌రావు తెలిపారు. మండలంలోని శృంగవరంలో శుక్రవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. లేగ దూడలను బాగా పెంచిన రైతులకు ఈప్రదర్శనలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఈఏడాది లేగ దూడలు ప్రదర్శనలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.3లక్షలు విడుదల చేసిందన్నారు. ఇంతవరకు 18 ప్రదర్శనలు నిర్వహించామని, మిగతావి ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వైఎస్సార్ పశుబీమా కోసం ప్రభుత్వం రూ.33 లక్షలు విడుదల చేసిందని తెలిపారు. ఈ పథకంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. పాడి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో భాగంగా ఆవులు, గేదెలకు కేవలం ఆడ పెయ్యిలు జన్మించే ఇంజక్షన్లు ఇస్తున్నట్టు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 6వేలకు పైగా ఇంజక్షన్లు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అనకాపల్లి జిల్లాలో 4వేల ఇంజక్షన్లు వేయాలన్నది లక్ష్యం కాగా, ఇంతవరకు 2,200 పైగా వేశామన్నారు. ప్రతి మండలంలో 30 నుంచి 40వరకు ఆడ పెయ్యిలు జన్మించినట్టు చెప్పారు. పాల ఉత్పత్తిని పెంచడంలో భాగంగా సంకర జాతి పశువులను పెంచేందుకు రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్నట్టు తెలిపారు.పశువులు, గొర్రెలు, మేకలకు వ్యాధులు రాకుండా వ్యాక్సిన్లు వేస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో పాయకరావుపేట పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీనివాసరావు, నాతవరం శృంగవరం పశువైద్యాధికారులు మోక్షారెడ్డి శరణ్య, శృంగవరం వైఎస్సార్‌సీపీ నాయకుడు కాళ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన కిరణ్‌కుమార్‌రెడ్డి


దెబ్బతిన్న బైక్

మారేడుమిల్లి: మారేడుమిల్లి -గుర్తేడు రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గిరిజన యువకులు గాయపడ్డారు. గుడిసె పర్యాటక ప్రాంతం నుంచి వస్తున్న బోలెరో వాహనం మారేడుమిల్లి నుంచి మోటార్ బైక్‌పై గుర్తేడు వైపు వెళ్లుతున్న ముగ్గురును బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో పాతకోట గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్ రెడ్డి తలకు తీవ్రంగా గాయమైంది. మరో ఇద్దరు కడబాల రాజుబాబు, సాదాల విజయకుమారిలు గాయపడ్డారు. వీరిని మారేడుమిల్లి పీహెచ్‌సీకి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ


అక్షింతలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

అనంతగిరి: మండలంలోని కొండిబ గ్రామంలోని అయోధ్య రాముని అక్షింతలను ఇంటింటికీ వెళ్లి విశ్వహిందూ పరిషత్ నాయకులు పడాల పోతురాజు, మధుసూదన్ పంపిణీ చేశారు. భక్తుల నడుమ జై శ్రీరామ్ నినాదాలతో ఊరేగించారు. అయోధ్యలోని ఈనెల 22న శ్రీరాముడు విగ్రహాన్ని ప్రతిష్టిస్తారని, ఆ రోజు ప్రతి కుటుంబం తమ ఇంటిముందు దీపాలను వెలిగించాలని అవగాహన కల్పించారు.

అటల్ సేతు నిర్మాణంలో విశాఖ ఉక్కు

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అతి పెద్ద అటల్ సేతు బ్రిడ్జి నిర్మాణంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను వినియోగించారు. దేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి గౌరవార్థం ముంబయిలోని సెవ్రీ నుంచి రాయగఢ్ జిల్లాలోని నవా శేవాను కలుపుతూ రూ.21,200 కోట్ల వ్యయంతో ఈ వంతెనను నిర్మించారు. ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో జరిగిన బ్రిడ్జి నిర్మాణ పనుల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 11,600 టన్నుల ఎఫ్‌ఈ 500డీ టీఎంటీ రీబార్ స్టీల్‌ను వినియోగించడం విశేషం. ప్రధాని మోదీ శుక్రవారం ఈ వంతెనను అధికారికంగా ప్రారంభించారు.

17న అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం, విశాఖపట్నంలో గల తిరుమల విద్యాసంస్థలలో ఐదు నుంచి 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు జరుగుతుందని ఆ సంస్థ చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు హాజరుకావాలనుకొనే తల్లిదండ్రులు, విద్యార్థులు రాజమహేంద్రవరం క్యాంపస్ కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. తిరుమల ఈడీయూ.కామ్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విశాఖపట్నం క్యాంపస్‌లో జరిగే సదస్సుకు హాజరు కావాలనుకొనేవారు ఆ క్యాంపస్‌లో అదే తేదీన నేరుగా సంప్రదించవచ్చన్నారు. 2023లో ఐఐటీ/ఎన్‌ఐటీ/ఐఐఐటీ/బిట్స్‌లలో 646 మంది విద్యార్థులు సీట్లు సాధించారని, ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన 233 మందిలో 14మంది ఎయిమ్స్‌లో సీట్లు సాధించారన్నారు.

70 కిలోల గంజాయి స్వాధీనం

మాడుగుల రూరల్: మండలంలో ముకుందపురం పెట్రోల్ బంకు వద్ద 70 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ పి.దామోదరనాయుడు తెలిపారు. బంకు వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేసినట్టు చెప్పారు. పాడేరు నుంచి చోడవరం వైపు వస్తున్న కారును తనిఖీ చేయగా గంజాయి బయటపడినట్టు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం పనసపుట్టు గ్రామానికి చెందిన నిందితుడు జనం జగన్నాథం(40)ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. నిందితుడిని నుంచి గంజాయి, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. గంజాయి, సాగు రవాణా చట్టరీత్యా నేరమన్నారు. సిబ్బంది ఉన్నారు.

ఘనంగా కూడారై ఉత్సవం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా శుక్రవారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోదాదేవి ఉత్సవమూర్తిని తిరువీధిగా సింహగిరిపై ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలకరించి పల్లకీలో తీసుకువచ్చి ఆలయ నీలాద్రి గుమ్మం వద్ద అదిష్ఠింపజేశారు. ఆలయంలోంచి వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను తీసుకొచ్చి నీలాద్రి గుమ్మం వద్ద ఆస్థాన మండపంలో వేంచేయజేసి ఎదురు సన్నాహోత్సవాన్ని వైభవంగా జరిపారు. పాశుర విన్నపం, సాత్తుమొరై, ధనుర్మాస పూజలు జరిపారు. కూడారై ఉత్సవ విన్నపపారాయణ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు నృత్యాలు చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈపూజలు నిర్వహించారు.

ఆన్‌లైన్‌లో అభ్యర్థుల ప్రొవిజనల్ వెరిఫికేషన్ జాబితా

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పాడేరు)లో గల వివిధ ఖాళీ ఉద్యోగాల భర్తీకి సంబంధించి దరఖాస్తుల పరిశీలన పూర్తి అయింది. దీంతో అభ్యర్థుల ప్రొవిజినల్ వెరిఫికేషన్ జాబితాను ఎన్‌ఐసీ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలత తెలిపారు. ఇందుకు సంబంధించి అభ్యంతరాలను ఈనెల 17 నుంచి 18వ తేదీ సాయంత్రం 5గంటల వరకు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థులు తమ అభ్యంతరాలను నేరుగా గాని లేదా మెయిల్ ఐడీః recruitmentgmcpaderu@gmail.com ద్వారా గాని తెలియజేయాలని సూచించారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం మెరిట్ జాబితాను విడుదల చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ప్రొవిజనల్ మెరిట్ జాబితా పొందుపరుస్తారని తెలిపారు. మెరిట్ జాబితా రోస్టర్ ఆధారంగా మాత్రమే అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు.

16న బౌద్ధ మేళా

అనకాపల్లి : మండలంలో శంకరం బొజ్జన్నకొండ వద్ద ఈనెల 16న బౌద్ధ మేళా నిర్వహిస్తున్నట్లు విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య సహాయ కార్యదర్శి బల్లా నాగభూషణం చెప్పారు. ఎంపీ బీవీ సత్యవతి తన కార్యాలయంలో శుక్రవారం మేళా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మేళాకు ముఖ్య అతిథులుగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతిని ఆహ్వానిస్తున్నామన్నారు. ఆరోజు ఉదయం సాయంత్రం వరకు కొండపై జరిగే మేళాలో బుద్ధుని పంచశీల సూత్రాలపై బుద్ధ గయ వస్తున్న బౌద్ధ భిక్షువులు వెనరబుల్ జ్ఞాన్‌దీప్ మహాథేరో, వెనరబుల్ బోధి రత్న మహాథేరో ప్రసంగంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వెయ్యి లీటర్ల పులుపు, సామగ్రి ధ్వంసం


పులుపు, నిల్వ చేసే డ్రమ్ములతో రావికమతం పోలీసులు

రావికమతం: కుముందానిపేట గ్రామ శివారు తోటల్లో సారా తయారీ స్థావరంపై స్థానిక పోలీసులు శుక్రవారం దాడి చేసి, వెయ్యి లీటర్ల పులుపు, పరికరాలు ధ్వంసం చేశారు. గ్రామంలో పెద్ద ఎత్తున సారా తయారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని ముందస్తు సమాచారం అందడంతో ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు సిబ్బందితో కలిసిదాడులు చేశారు.సారా తయారీకి సిద్ధంగా ఉన్న పులుపు, తయారీకి ఉపయోగించేందుకు డ్రమ్ములను,పరికరాలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు.

పండగ వేళ విషాదం

- విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


మృతుడు నాగేశ్

కోటవురట్ల: పండగవేళ ఆ ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకొందామని భావించిన ఆ కుటుంబం పెద్దను మృత్యువు కబళించింది. గొట్టివాడ గ్రామానికి చెందిన రాచపతి నాగేశ్ (45) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తన పొలంలోని మకాంలో షెడ్‌లో బల్బు వెలగపోవడంతో నాగేశ్ హోల్డర్ విప్పి మరమ్మతు చేస్తుండగా షాక్ కొట్టింది. దీంతో ఎంసీబీ ఆఫ్ చేసి మళ్లీ రెండు వైర్లు పట్టుకునేసరికి తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. కేకలు విని పొలంలో ఉన్న రైతులు హుటాహుటిన అతని కోటవురట్లలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. నాగేశ్ వ్యవసాయంతో పాటు సరుగుడు కర్రల వ్యాపారం కూడా చేస్తుంటాడు. తన ఇద్దరు అమ్మాయిలను చదివిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇంతలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. నాగేశ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య ఉమాదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్‌ఐ రమణయ్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.